ముమ్మరంగా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు

- గుడివాడ నియోజకవర్గంలో 27 క్లినిక్‌ల మంజూరు
- గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- పీహెచ్‌సీలకు అనుసంధానంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు



మల్లాయపాలెం-2లో పూర్తయిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్


పుట్టగుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న హెల్త్ క్లినిక్ భవనం

గుడివాడరూరల్: మాట తప్పని.. మడప తిప్పని నేతగా పేరుగాంచిన దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా పాలన అందిస్తున్నారు. పాదయాత్రలో పేద వర్గాలకు గ్రామస్థాయిలోనే వైద్య సేవలను 24 గంటలకు అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. సచివాలయ పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పేరిట గుడివాడ నియోజకవర్గ వ్యాప్తంగా 27 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలకు ఒక్కో క్లినిక్‌కు రూ.17.80 లక్షల చొప్పున ప్రభుత్వం రూ.4.73 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ల ద్వారా పనులను ఇప్పటికే ప్రారంభించారు. పల్లెల్లో రాత్రి వేళల్లో సరైన వైద్య సేవలు అందక ప్రజలు పడుతున్న ఇబ్బందులను పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పేరిట గ్రామ స్థాయిలో సచివాలయ పరిధిలో ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివిధ దశల్లో పనులు

గుడివాడ నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాలైన గుడివాడకు 6, నందివాడకు 12, గుడ్లవల్లేరుకు 9 వెరసి 27 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు, అధికారులు భవన నిర్మాణాలను శరవేగంగా జరుపుతున్నారు. గుడివాడ మండలంలోని దొండపాడు, మల్లాయపాలెం-2 హెల్త్ క్లినిక్‌లు పూర్తి కాగా చౌటపల్లి, కల్వపూడి అగ్రహారం, రామనపూడి గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. శేరీగొల్వేపల్లిలో గ్రామంలో స్థల సేకరణ సమస్య కారణంగా ఇంకా పనులు ప్రారంభించలేదు. అదే విధంగా నందివాడ మండలంలో తుమ్మలపల్లి, కుదరవల్లి గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు పూర్తి కాగా అనమనపూడి, ఇలపర్రు, పుట్టగుంట, తమిరిశ గ్రామాల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అరిపిరాల, జనార్దనపురం, నందివాడ, పెదలింగాల, పోలుకొండ, రుద్రపాక గ్రామాల్లో స్థల సేకరణ సమస్యల కారణంగా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ గ్రామాల్లో సైతం త్వరితగతిన భవన నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలంలో చంద్రాల గ్రామంలో పూర్తి కాగా డోకిపర్రు-2, గుడ్లవల్లేరు-2, కౌతవరం-2, శేరీదగ్గుమిల్లి, శేరీకల్వపూడి గ్రామాల్లో పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. డోకిపర్రు-1, కూరాడ,వేమవరం గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు ప్రారంభానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. నిర్మాణాలు పూర్తయిన వాటికి ఇప్పటికే రూ.59 లక్షలు బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. రూ.31లక్షలు మాత్రమే మంజూరు కావాల్సి ఉంది.

తీరనున్న కష్టాలు..



గ్రామస్థాయిలోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజల కష్టాలు తీరనున్నాయి. గతంలో రాత్రి సమయాల్లో వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. ఆనాడు పేద ప్రజలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి వైద్య సేవలు అందించగా ప్రస్తుతం తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలోనే పేదవర్గాలకు వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉంది.

–ఎం.సత్యనారాయణ, గుంటాకోడూరు

నాణ్యతా ప్రమాణాలతో పనులు..



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ విషయంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నాం. కాంట్రాక్టర్లు సైతం సహకరించి రాజీ లేకుండా పనులు పూర్తి చేస్తున్నారు. గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉండగా మరిన్ని చోట్ల పనులు ప్రారంభించాల్సి ఉంది. చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం. ఇంకా నిర్మాణ పనులు చేపట్టని గ్రామాల్లో పనులను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

–హరనాథ్‌బాబు, పంచాయతీరాజ్ డీఈ

సమష్టి కృషితో శ్మశానవాటిక అభివృద్ధి

గుడ్లవల్లేరు: సమష్టి కృషితో చంద్రాల శివారు సింగలూరులోని శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సంఘ సేవకుడు, శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తెలిపారు. శ్మశానవాటికలోని దహన సంస్కారాల భవనానికి శ్లాబు నిర్మాణ పనులను మంగళవారం చేపట్టారు. గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.12 లక్షల అంచనాతో అభివృద్ధి పనులను చేయిస్తున్నామని డాక్టర్ బండారు చెప్పారు. మరొక రూ.15 లక్షల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వ నిధులను గ్రామస్తులు కోరుతున్నారని పేర్కొన్నారు. గతంలో గ్రామాభివృద్ధిలో పాలు పంచుకుని సింగలూరును ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిపిన తమ గ్రామస్తులు మరొక సారి అభివృద్ధిలో తమ వంతుగా చేయూతనందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఉద్దంటి శివ నాగ మల్లేశ్వరరావు, సభ్యులు నందం శ్రీనివాసరరావు, మాచర్ల రమణయ్య, కోట పైడేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న డాక్టర్ శ్యామ్‌కుమార్ తదితరులు

క్లుప్తంగా

సామూహిక కుంకుమార్చన

మండవల్లి: మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో మంగళవారం పూజ్యశ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ తల్లి మాతా జయలక్ష్మి జయంతి, శంకర జయంతి సందర్భంగా సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. స్వామీజీ గురువు, జయలక్ష్మిమాత స్వామీజీకి సకల శాస్త్రాలు బోధించారు. దత్త పరంపరలో జయలక్ష్మి మాతను సాక్షాత్తూ అమ్మవారి స్వరూపంగా కొలుస్తారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్‌శంకర్, కనకదుర్గా, సీనియర్ న్యాయవాది రుద్రపాక దత్తారావు, వెంకటకృష్ణారావు, రాజేంద్ర ప్రసాద్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్పంచ్ ఝాన్సీకి సత్కారం



మండవల్లి: మండవల్లి గ్రామ పంచాయతీ హెల్తీ పంచాయతీగా ఎంపిక కావటంతో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నుంచి సర్పంచ్ మెండా ఝాన్సీ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సొసైటీలో సర్పంచ్ దంపతులు ఝాన్సీ, సురేష్‌లను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్ మంగళవారం ఘనంగా సత్కరించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మెండా సురేష్, పాలక వర్గ సభ్యులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం



ముదినేపల్లిరూరల్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధితులను డాక్టర్ అంబుల మనోజ్ మంగళవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. మండలంలోని కొరగుంటపాలెం శివారు రాజానగరానికి చెందిన నాయుడు రామారావు, లక్ష్మీనారాయణ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం దగ్ధమైన విషయం విదితమే. దాతను గ్రామస్తులు అభినందించారు.

ఎస్‌ఏ -2 పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

ముదినేపల్లిరూరల్: విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పరీక్షించేందుకు నిర్వహించే ఎస్‌ఏ-2 పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని వడాలి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. ముదినేపల్లి మండలం దేవరం, కాకరవాడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో పరీక్షల నిర్వహణను మంగళవారం ఆయన పరిశీలించారు. పరీక్షలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఓఎమ్మార్ షీట్లను సక్రమంగా పూరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉపాధ్యాయులను ఆదేశించారు.

యువత దేశానికి ఆదర్శం కావాలి

గుడివాడటౌన్: మారుతున్న సమాజంలో యువత కేవలం విద్య, ఉద్యోగం విషయాలపైన దృష్టిపెడుతున్నారని ప్రజా సేవ, ప్రకృతి సేద్యం, సమాజ సేవలపై దృష్టిసారించాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఉత్సవ్‌లో భాగంగా పెయింటింగ్, కల్చరల్ డ్యాన్స్, ఫొటోగ్రఫి, పద్యాలు, ఎలక్యూషన్ అనే ఐదు అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ టీఎస్‌ఎస్ బాలాజీ, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శేఖర్‌సింగ్, కో-ఆర్డినేటింగ్ మెంబర్ వినోద్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదు, రెడ్‌క్రాస్ సెక్రటరీ బి.శంకరనాథ్ పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

కైకలూరు: పాతకక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి చేసిన ఘటనపై కై కలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కైకలూరు మండలం రామవరం గ్రామానికి చెందిన దర్శి కిరణ్(19) దుంపగడపలో ఇంటర్ చదివి ప్యాకింగ్ పనులకు వెళ్తున్నాడు. కొద్దినెలల క్రితం కలిదిండి మండలం తాడినాడ గ్రామానికి చెందిన కొందరి యువకులతో గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో కిరణ్, అతని స్నేహితుడు ఇంటి లక్ష్మణ్‌తో కలిసి కైకలూరు మండలం ఉప్పుటేరు సెంటర్ వద్ద ఎలక్ట్రికల్ సామగ్రి కొనుగోలు నిమిత్తం సోమవారం రాత్రి వచ్చారు. గతంలో ఘర్షణ పడిన యువకులకు కిరణ్, లక్ష్మణ్‌ను ఎదురుపడటంతో ఇద్దరిని కొట్టారు. కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో కిరణ్‌కు చికిత్స అందించారు. క్షతగాత్రుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్‌ఐ గాయత్రి తాడినాడకు చెందిన చాబత్తిన రవిరాజు(25), మర్కురాజు(24)పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో మరికొందరిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉందని పోలీసులు చెప్పారు.

సంక్షేమానికి జగనన్న అగ్రతాంబూలం

ముదినేపల్లిరూరల్: రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అగ్రతాంబూలం ఇస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ అన్నారు. ముదినేపల్లి మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. దీంతో పెదపాలపర్రులో ముగింపు విజయోత్సవ సభ నిర్వహించారు. అంతకు ముందు పెదపాలపర్రులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పేదల సంక్షేమానికి సంబంధించిన అన్నింటిని ముఖ్యమంత్రి జగనన్న నెరవేర్చారన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులంతా గడప గడపకు వెళ్లి ప్రజల అభిప్రాయాల మేరకు పాలన సాగించేందుకు కృషి చేస్తున్నారన్నారు.

ప్రతి పేదవాడికీ సొంతిల్లు..

సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకుంటున్నామని, పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాల ఫలాలు వర్తింపజేస్తున్నామని ఎమ్మెల్యే డీఎన్నార్ చెప్పారు. మహిళలు, రైతులకు ప్రథమ ప్రాధాన్యత నిస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికీ సొంతిల్లు కల్పించేందుకు నియోజకవర్గంలో 13 వేల మంది మహిళలకు స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్ల నిర్మాణాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు భారీ ఎత్తున ఎమ్మెల్యే డీఎన్నార్‌కు., ఎమ్మెల్సీ వెంకటరమణకు హారతులిచ్చి, స్వాగతం పలికి, గజమాలలతో సన్మానించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, ఎంపీటీసీ సభ్యురాలు మేడేపల్లి దుర్గ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నేతలు బొర్రా శేషుబాబు, కోమటి విష్ణువర్ధన్, గంటా కోటేశ్వరరావు, బొప్పన ప్రసాద్, చల్లగుల్ల శ్రీకాంత్, మెరుగుమాల గోవిందరాజులు, షేక్ అల్లాభక్షు, బేతపూడి వెంకటరమణ, మెరుగుమాల వెంకటేశ్వరరావు, పార్టీ సోషల్‌మీడియా మండల కన్వీనర్ పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ వెంకట రమణ, ఎమ్మెల్యే డీఎన్నార్‌ను సన్మానిస్తున్న నాయకులు

పీఎం జీవనజ్యోతి బీమా అందజేత



గుడ్లవల్లేరు: ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం ద్వారా పేదలైన బ్యాంకు ఖాతాదారులకు మేలు చేకూరుతుందని అంగలూరు కెనరా బ్యాంక్ మేనేజర్ కె.విజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల మృతి చెందిన వీర్ల వీర కుమారి కుటుంబానికి మంగళవారం పీఎం జీవనజ్యోతి బీమా ద్వారా రూ.2 లక్షల డీడీని అందజేశారు. ఖాతాదారుల వయసు ప్రాతిపదికన ఈ బీమా వర్తిస్తుందని చెప్పారు. తమ బ్యాంకు ఖాతాదారులు ప్రీమియంను తమ బ్యాంకులో చెల్లించవచ్చన్నారు. సాధారణ మరణం, ప్రమాదవశాత్తూ మృతి చెందితే బీమా నగదు అందజేస్తామని చెప్పారు. బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకుడు సీహెచ్.అభయాంజనేయస్వామి, బ్యాంక్ ఆఫీసర్ పామర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

నిభానుపూడి(పామర్రు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధి నిభానుపూడి గ్రామంలో ఉపాధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండల పరిదిధిని 25 గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో పొలురాజు, ఫీల్డు అసిస్టెంట్ భారతి, సచివాలయం కన్వీనర్ దాసి నాంచారయ్య, గృహసారథులు కల్పన, వార్డుమెంబర్లు ఆరిసి రాజేశ్వరి, శ్రీను, నాంచారయ్య, రాంబాబు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

చావలిపాడులో ఉపాధిహామీ పనులు

మండవల్లి: మండలంలోని చావలిపాడు బాబూరావు గుంత (చెరువు)లో ఉపాధి హామీ పనులు మంగళవారం నిర్వహించారు. వీటి అంచనా విలువ రూ.2 లక్షల 60 వేలు కాగా 120 మంది ఉపాధి హామీ కూలీలు పనులు నిర్వహించారని ఎంపీడీవో నవీన్ తెలిపారు. ఈ పనుల ద్వారా రైతుల సాగు, తాగు నీటి సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. పశువుల తాగునీటి సమస్యలు కూడా తీరుతున్నాయని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

28న స్టడీ సర్కిల్

గుడివాడటౌన్: గుడివాడ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 28న ఆర్థిక విధానాలు-సామాజిక న్యాయం అనే అంశంపై స్టడీసర్కిల్ నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రముఖ వక్త నక్కా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం


కైకలూరు సీహెచ్‌సీ వద్ద ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ కృష్ణ తదితరులు


తోట్లవల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న, సిబ్బంది

కైకలూరు: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కై కలూరు ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ), కలిదిండి పీహెచ్‌సీల వద్ద మలేరియా నివారణ చర్యలపై సదస్సులు, ర్యాలీలు మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. దోమ కాటుకు గురికాకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, దోమ తెరలను వాడలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎస్.రాంబాబు, తహసీల్దార్ తేజోమణి, ఎంపీడీఓ సీతారాంకుమార్, టీడీ ఎండీ ఇబ్రహీం, పీహెచ్‌సీల డాక్టర్లు బి.హేమలత, బి.శంకర్, డీహెచ్‌ఎన్ ప్రసాద్, సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్‌ఎస్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది ఏఎస్‌ఎస్‌ఎన్ మూర్తి, జి.శ్రీనివాసరావు, సీహెచ్ కనకదుర్గ, కె.కరుణ, వీఆర్వో వీర్రాజు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నిర్మూలన సాధ్యమని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన తోట్లవల్లూరులో మంగళవారం ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. ఇళ్లకు జాలీలు, దోమతెరలు వినియోగించాలని చెప్పారు. పూల కుండీలు, పూల తొట్టెల్లో వారానికి ఒకసారి నీరు మార్చాలన్నారు. సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ మాణిక్యం, హెచ్‌వీ రోహిణి, ఎంపీహెచ్‌ఎస్ అనిల్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొవ్వ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

మొవ్వ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు లేకుండా చేసి దోమల నివారణను అరికట్టాలని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పీఎస్ రాజు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం మొవ్వ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీని నిర్వహించారు. అనంతరం మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో పీఎస్ రాజు వెంట్రిక్యులాయిజమ్(మాట్లాడే బొమ్మ) సహాయంతో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు తదితర వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో మొవ్వ వైద్యాధికారి ఎం.వేదరాజ్, సీహెచ్‌వో డి.శంకరరావు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై శిక్షణ



గుడ్లవల్లేరు: మండల పరిధిలో త్వరలో నిర్వహించనున్న పాఠశాల సామాజిక తనిఖీని పారదర్శకంగా నిర్వహించాలని ఎంఈఓ కె.సుబ్రహ్మణ్యం ఆదేశించారు. గుడ్లవల్లేరు ఏఏఎన్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల సామాజిక తనిఖీపై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. పేరెంట్స్ కమిటీల సహకారం ఉంటే స్థానికంగా పాఠశాలల అభివృద్ధికి ఉపయుక్తమవుతుందని ఆయన చెప్పారు. నాడు-నేడు, మనబడి, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలపై ఉపాధ్యాయులతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సీఎంఓ రామకృష్ణారావు, హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీలు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

గుడివాడటౌన్: అరుణాచలం గిరి ప్రదక్షిణలకు గుడివాడ నుంచి బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ డి.రాజేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3వ తేదీ రాత్రి 8 గంటలకు గుడివాడ నుంచి లగ్జరీ బస్సు బయలుదేరి 4న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దేవాలయాలు దర్శించుకుని రాత్రి 11 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. 5వ తేదీ గిరి ప్రదక్షిణ అనంతరం బస్సు అరుణాచలంలో బయలుదేరి 6వ తేదీ ఉదయం గుడివాడకు చేరుకుంటుందన్నారు. టికెట్ ధర రూ రూ.3 వేలుగా నిర్ణయించామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రేణుకా పరమేశ్వరునికి అన్నాభిషేకం



పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలోని శ్రీ రేణుకా పరమేశ్వరస్వామి, శ్రీ షిర్డి సాయిబాబా, శ్రీనాగ పరివార సహిత శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండపారాధన, దీక్షా ధారణ, చండీ పారాయణ తదుపరి స్వామి వార్లకు పంచామృతాభిషేకం, నవరస ఫల, పాలాభిషేకాలను చేపట్టారు. అనంతరం భక్తులచే అన్నాభిషేకం నిర్వహించారు. తొలుత స్వామికి ఆరుద్ర జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలను జరిపారు. సాయంత్రం లక్ష్మీ గణపతి రుద్రదేవి చండీహోమాలను ప్రముఖ యాజ్ఞిక స్వామి ఎస్ఎస్ కార్తీక శర్మ వారి శిష్య బృందంచే నిర్వహించారు. సహస్ర నామాలతో విశేషంగా పూజా కార్యక్రమాలు, భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, అధ్యక్షుడు వరదా అప్పారావు, కమిటీ సభ్యులు అప్పారావు, కె.చెన్నారాయుడు, ఉమామహేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి



గుడివాడటౌన్: జగద్గురు శ్రీ ఆది శంకాచార్యుల జయంతి వేడుకలు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దనియాలపేటలోని ప్రణవాశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ స్థైర్యానంద సరస్వతి స్వామి వారి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశంకరాచార్యుల గొప్పదనాన్ని భక్తులకు వివరించాలని సరస్వతీ స్వామి తెలిపారు. సర్వసమానత్వం చూపుతూ మానవాళికి శంకరాచార్యులు చూపిన మార్గాలను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ ఆర్.వేణుబాబు, లయన్స్ క్లబ్ ప్రగతి అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, పూర్వ అధ్యక్షుడు ఆర్.మురళీధర్ పాల్గొన్నారు.

బంటుమిల్లి రోడ్డులో..

బంటుమిల్లి రోడ్డులోని పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ఆది శంకరాచార్యులు జయంతి వేడుకలు జరిపారు. విజయవాడ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ దేవు నరసింహారావు, సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, విశ్రాంత ఎంఈఓ శంకరనాథ్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి.నగేష్, కె.దుర్గాచారి, సంఘ సభ్యులు వి.వీరాచారి, ఎ.నాగాచారి, వి.కృష్ణకిషోర్ పాల్గొన్నారు.